అజాగ్రత్తగా ఉంటే అపాయమే

- వర్షాకాలంలో విద్యుత్ తీగలు, మోటార్లతో జాగ్రత్త
- స్టార్టర్లు, విద్యుత్ లైన్లకు స్వీయ మరమ్మతులు చేయొద్దు
- హెచ్చరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు



బోర్ల కింద సాగు చేసిన వరి నారు





మోటార్ స్విచాన్ చేస్తున్న రైతు ఎర్రిస్వామి, పంపుసెట్ వద్ద స్టార్టర్ బాక్స్

- గుమ్మఘట్ట మండలం పైదొడ్డిలో ఇటీవల రైతు నాయకుల పాలయ్య విద్యుత్ మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. స్టార్టర్ బాక్సును ముట్టుకోగానే విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు.

- గుమ్మఘట్ట మండలం భూపసముద్రంలో బోయ మహాలక్ష్మి అనే వివాహిత ఇటీవల మోటార్ స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. ఇలా ఈ రెండు చోట్లే కాదు..వర్షాకాలం వచ్చిందంటే చాలు, చాలచోట్ల విద్యుత్‌షాక్‌తో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఏటేటా పెరుగుతున్న మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఇటీవల వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు మొదలయ్యాయి. రైతులు కూడా సాగు పనుల్లో బిజీ అయ్యారు. ఇప్పటికే దుక్కులు దున్నడం, బోర్ల కింద పిట్ట మడులు సిద్ధం చేయడం, వరి నార్లు పెంచడం, మొక్కజొన్న, పత్తి తదితర విత్తుకోవడం వంటి పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. భారీ వర్షాలకు పొలాలు, వ్యవసాయ తోటలు కూడా తడిసిముద్దయ్యాయి. ఈ క్రమంలో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువ. రైతులు స్టార్టర్ పెట్టెల వద్దకు వెళ్తుంటారు. మోటారు స్విచ్ ఆన్ చేసే క్రమంలో షాక్‌కు గురై, ప్రమాదాలబారిన పడడం, మృత్యువాత పడుతున్నారు. అలాంటి వారి సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై కథనం.

స్టార్టర్ల వద్ద జాగ్రత్త..

- విద్యుత్ మోటార్ల స్టార్టర్‌కు వర్షం నీరు తగలకుండా చెక్కపెట్టెలు, లేదా ప్లాస్టిక్ పెట్టెల్లో అమర్చకుంటే ప్రమాదాలు అరికట్టవచ్చు.
- ఒక్కోసారి ఎలుకలు విద్యుత్ తీగలను కొరికి (నాశనం) వేస్తాయి. ఈ కారణంగా ఇనుప పెట్టెలకు వైర్లు తగిలి విద్యుత్ సరఫరా జరిగి ఉంటుంది. తెలిసో తెలియక రైతు ముట్టుకోగానే షాక్‌కు గురికావాల్సి వస్తోంది.
- దీని పట్ల జాగ్రత్త వహించాలి. అప్పుడే మరణాలను అరికట్టవచ్చు.
- కొందరు రైతులు అనుభవం ఉన్నట్టు సొంతంగా మరమ్మతులు చేస్తుంటారు. ఇది ప్రమాదకరం. సమస్య చిన్నదైనా సరే విద్యుత్ అధికారులు లేదా దగ్గర్లో ఉండే మోటార్ మెకానిక్‌లను ఆశ్రయించడం ఉత్తమం.

సలహాలు, సూచనలు తప్పనిసరి

- విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటార్‌కు మధ్య దూరం ఎక్కువ ఉండరాదు.
- మెయిన్ లైను నుంచి త్రీఫేజ్ లాగే వైరుకు ఫ్యూజ్ ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.
- తడవని ప్రదేశంలో స్టార్టర్ బాక్సు ఉంచుకోవాలి. సరఫరాలో లోపం ఉంటే విద్యుత్ అధికారులు, మెకానిక్‌లను సంప్రదించాలి.
- ఈదురు గాలులు, వర్షాలకు ఎక్కడైనా విద్యుత్ తీగలు, స్తంభాలు విరిగినట్లయితే సంబంధిత అధికారులకు తక్షణం సమాచారం ఇవ్వాలి. అలాంటి చోట సొంత ప్రయోగం మంచిది కాదు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాకాలం వచ్చిందంటే చాలు..వ్యవసాయ బోర్లు, స్టార్టర్లు, విద్యుత్ తీగల విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పొలాలు, విద్యుత్ తీగలు తడుస్తున్నాయి. తేమ ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తాయి. ఎల్‌టీ లైన్ నుంచి స్టార్టర్‌కు సరఫరా అయ్యే వైరు నాణ్యతగా ఉండాలి. స్టార్టర్ బాక్సును చెక్క లేదా ప్లాస్టిక్ బాక్సులో అమర్చి, తడిలేని ప్రాంతంలో ఉంచుకోవాలి. చిన్న నిర్లక్ష్యానికి పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. సమస్య ఏదైనా తమ దృష్టికి తీసుకొస్తే ఎలా పరిష్కారించాలో చూస్తాం. అజాగ్రత్తగా ఉంటే ప్రాణాలకు ముప్పు తప్పదు.

– బాలచంద్ర, విద్యుత్‌శాఖ ఏఈ, రాయదుర్గం

క్లుప్తంగా

గజలక్ష్మి ఆలయంలో పూజలు



ప్రత్యేక పూజలందుకున్న గజలక్ష్మిదేవి

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులు పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయం, దండుమారెమ్మ ఆలయాల్లో అమ్మవారికి పూజలు చేశారు.

మొక్కల పెంపకం చేపట్టండి

కుందుర్పి: కళ్యాణదుర్గం రేంజ్ పరిధిలో అతి పెద్ద అటవీ ప్రాంతమైన జంబుగుంపల అడవి లో మొక్కల పెంపకం చేపట్టి, సంరక్షణాధికారులను నియమించాలని ఎంపీపీ నాగరాజు, సర్పంచ్ గంగాధర తదితరులు అటవీశాఖ బీట్ ఆఫీసర్ పరమేశ్వరప్పకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 7వేల ఎకరాలకు పైబడి ఉన్న ఈ అడవికి బీట్ ఆఫీసర్ మాత్రమే పనిచేస్తున్నారని, అదనంగా మరో ఇద్దరు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లను నియమించాలని కోరారు. అడవిలో బల్లపరుపుగా ఉన్న నండుంబీడు, గౌరమ్మపెంట, కొత్తపల్లి ఆరుబయలు తదితర ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు.

బహిరంగ వేలంలో పెరిగిన ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: మండలంలోని బూదగవి ఆంజనేయస్వామి దేవస్థాన భూమి 44.29 ఎకరాలు కౌలుకు ఇవ్వడానికి దేవదాయ శాఖ కార్యనిర్వహణ అధికారులు రమేష్‌బాబు, అంగదాల కృష్ణయ్య, పోలీసులు శుక్రవారం వేలం వేశారు. ఈవేలంలో 44.29 ఎకరాల భూమిని రూ.2.92 లక్షలు మొత్తానికి రైతులు కౌలుకు తీసుకున్నారు. గతేడాది నిర్వహించిన భూముల కౌలు వేలంలో రూ.1.41 లక్షలు మాత్రమే ఆదాయం రాగా, ఈఏడాది రూ.1.51 లక్షలు ఆదాయం పెరిగినట్లు ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో ఉరవకొండ అర్బన్ సీఐ సురేష్ బాబు, పోలీసులు పాల్గొన్నారు.

20 మంది చిన్నారులు పాఠశాలలో చేరిక



అడ్మిషన్ పొందిన చిన్నారులతో ఉపాధ్యాయులు,అంగన్‌వాడీ కార్యకర్తలు

కంబదూరు: మండలంలోని ఓబగానిపల్లిలో ఐదేళ్లు నిండిన రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పూర్తి చేసిన చిన్నారులు 20 మంది స్థానిక ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం చేర్పించినట్లు కార్యకర్తలు విజయమ్మ, అరుణ తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన ఉంటుందన్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలందరినీ ప్రభుత్వ పాఠ శాలలో చేర్పించేలా కృషి చేశామని తెలి పారు. ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, ఉపాధ్యాయులు మల్లేష్, సాయి, జ్యోతి, ఆశా కార్యకర్త వనజ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

18న కేంద్ర బృందం పర్యటన

వజ్రకరూరు: మండలంలో ఈనెల 18న కేంద్రం బృందం (మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్‌- ఐఎంసిటీ) పర్యటించనున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ రఫీ తెలిపారు. శుక్రవారం వజ్రకరూరులో తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం 3గంటలకు గూళ్యపాళ్యం, 5గంటలకు గడేహోతూరులో కేంద్ర బృందం పర్యటించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పిద్దాం

అనంతపురం సెంట్రల్: చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొండమ్మ పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఓబుళదేవనగర్‌లో తల్లులకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న పిల్లలకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం వలన చిన్నారుల్లో సృజనాత్మకత, ఊహాశక్తి పెంపొందడం జరుగుతుందన్నారు. తోటివారితో కలిసిమెలసి ఉండడం వలన సత్సంబంధాలు ఏర్పడి సాంఘిక విలువలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమశ్రీ, నిర్మల, అన్నమ్మ, హెల్పర్లు లక్ష్మి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

హస్త కళలను ఆదరించాలి



హస్తకళా ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న అధికారులు

అనంతపురం కల్చరల్: భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే హస్తకళలను ఆదరించాలని లేపాక్షి ఎంపోరియం అధికారులు కోరారు. ఐదు రోజుల పాటూ సాగే హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అనంతకు విచ్చేసిన హస్తకళాకారుల అల్లికల ఉత్పత్తులు అందరిని ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. కొండపల్లి బొమ్మలు, సంప్రదాయ అద్దకాలు, తోలుతో చేసిన వస్తువులు, వివిధ రకాల దేవతామూర్తుల, కళాఖండాల అమరికలు, లోహపు వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. శతాబ్దాలుగా వస్తున్న తమ హస్తకళను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. కృత్రిమంగా యంత్రాలపై తయారైన వస్తువులతో పోలిస్తే హస్తకళా ఉత్పత్తులు ఎంతో నాణ్యంగా ఉంటాయని పేర్కొన్నారు. అంతకు ముందు కళాభిమానులు బారులు తీరి హస్తకళా ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో లేపాక్షి సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనలో భాగస్వాములు కావాలి



ఉరవకొండలో వర్షపు నీరు నిలిచిన చోట ఆయిల్ బాల్స్ వేస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఉరవకొండ: మలేరియాను నిర్మూలించడంలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకొని ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈఓ ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది పట్టణంలో మురుగు నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్‌బాల్స్ వేయించి, బ్లీచింగ్ పౌడర్ చెల్లించారు. అనంతరం సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ప్రజలను చైతన్యం చేస్తు ర్యాలీ చేశారు. కొకుంట్లలలో ర్యాలీ, కరపత్రాల ప్రచారం: పెద్దకొకుంట్లలలో మలేరియా ప్రబల కుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ కరపత్రాలు అందించి, చైతన్య పరిచారు.

అన్ని దానాల్లోకెల్లా రక్తదానం మిన్న

అనంతపురం మెడికల్: అన్ని దానాల్లోకెల్లా రక్తదానం చాలా గొప్పదని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులు, రోగులు, గర్భిణులు, బాలింతలకు రక్తం అవసరం అవుతుందన్నారు. సకాలంలో రక్తం ఎక్కించని పక్షంలో మృత్యువాతపడే అవకాశం ఉంటుందన్నారు. యువత సామాజిక స్పృహతో రక్తదానం చేయడానికి ముందుకురావాలన్నారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, ఐసీఎన్‌లు రేష్మ, శోభ, నీలిమ, ప్రసన్న, స్టాఫ్‌నర్సులు సుజాత, సురేష్, బ్లడ్ బ్యాంకు సిబ్బంది రమణారెడ్డి, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



ఉద్దేహాళ్‌లో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: రక్తదానం చేయడం అంటే ప్రాణ దానం చేసినట్లే అని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలత, మహేశ్వరి అన్నారు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్న రక్తదానం ఎంతో గొప్పదన్నారు. 18 ఏళ్లు నిండిన వారు రక్తదానం చేయవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎం గోవర్ధన, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఏపీ హంస నగర కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

అనంతపురం మెడికల్: ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అనంతపురం నగరశాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శుక్రవారం నగరంలోని పాతూరు సీడీ ఆస్పత్రిలో హంస జిల్లా అసోసియేషన్ జిల్లా కన్వీనర్లు ఎస్‌ఎండీ రఫీ, కోకిల చాముండేశ్వరి అధ్యక్షతన జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెపల్లి పామన్న, ఎన్నికల అధికారులుగా వెంకట కృష్ణమూర్తి, లక్ష్మి వ్యవహరించారు.

కార్యవర్గ సభ్యులు..

హంస నగరాధ్యక్షుడిగా కుళ్లాయ బాబు (ఫార్మసిస్టు), అసోసియేట్ అధ్యక్షురాలిగా శోభారాణి (నర్సింగ్ కాలేజీ బోధకురాలు), ఉపాధ్యక్షులుగా అలివేల మంగమ్మ, తిప్పేరుద్రమ్మ (స్టాఫ్‌నర్సు, జీజీహెచ్), గిరిధర్ రెడ్డి (ఎంపీహెచ్ఈఓ), రామాంజనేయులు (యూడీసీ, జీఎంసీ), భక్తర్ అలీఖాన్ (డిప్యూటీ డీఎస్ఓ), విశాలాక్షి (ట్రైనింగ్ పీహెచ్ఎన్), ఎస్.లోకేశ్వర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎల్లప్ప (ఎంపీహెచ్ఈఓ, ట్రైనింగ్ స్కూల్), సహాయ కార్యదర్శిగా కే సుదర్శన్ రెడ్డి (కాంపౌడర్ ఆయుష్), ఉమాదేవి, జమున, సంధ్య అరుణ (స్టాఫ్‌నర్సులు), మంజుల దేవి (డీఐఓ కార్యాలయం) ఎన్నికయ్యారు.

చిత్రలేఖనంలో మెలకువలు



చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

అనంతపురం కల్చరల్: పెన్సిల్ ఆర్ట్, పాట్ డ్రాయింగ్, లెటర్ ఆర్ట్, కలరింగ్‌లో చిన్నారులు మెలకువలు నేర్చుకుని అద్భుతమైన చిత్రాలతో ఆకట్టుకున్నారు. శుక్రవారం అనంత బాలోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత డ్రాయింగ్ శిక్షణ శిబిరం స్థానిక ఇందిరా నగర్‌లో జరిగింది. ప్రముఖ చిత్రకారుడు కత్తి విజయ్‌కుమార్ చిన్నారులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలోత్సవ్ కమిటీ సభ్యులు సావిత్రి, శ్రీనివాస్, రాజ్‌మోహన్, కళాసాగర్ ఆర్ట్ స్కూల్ విజయ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. కేవలం చదువు, ర్యాంకులతో మాత్రమే కాకుండా కళలను చదువుకు అనుసంధానం చేసే ప్రక్రియను నేర్చుకోవాలని చిన్నారులకు సూచించారు. ముఖ్యంగా మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులకు చక్కటి బొమ్మలు గీచే నైపుణ్యం అవసరమన్నారు. అలాగే భాషా సంబంధిత పాఠ్యాంశాలను చక్కటి రాతతో రాసేలా ఉచిత శిక్షణ ఇచ్చామని తెలిపారు. అనంతరం ప్రతిభ కనపరచిన చిన్నారులకు బహుమతులు, అందరికి ప్రశంసాపత్రాలను అందజేశారు.

నేడు సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతి సందర్భంగా నగరంలోని లలిత కళా పరిషత్తులో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు చంద్ర సినీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సంగీత విభావరి జరుగుతుందని నిర్వాహకుడు తలారి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ప్రముఖ సినీగాయనీ గాయకులతో మధుర గీతాల ఆలాపన, గానగాంధర్వుడికి సంగీత శ్రద్ధాంజలి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

- పంటల సాగుకు ముందు నేల పరీక్షలు తప్పనిసరి
- సేంద్రియ కర్బనం కలిగిన నేలల్లో మంచి ఫలితాలు



ఒంటిమిద్ది వద్ద పొలంలో భూసార పరీక్షలు చేస్తున్న ఏఓ జగదీష్, ఆర్‌బీకే సిబ్బంది

కళ్యాణదుర్గం: భూసార పరీక్షలతో ఖరీఫ్ పంటల సాగులో అధిక దిగుబడులు సాధించొచ్చు. ఖరీఫ్ సమయంలో ప్రతి రైతూ తమ పొలాల్లో నేల పరీక్షలను చేయించుకొని అధిక దిగుబడులు సాధించడానికి చొరవ చూపాలి. భూసార పరీక్షలపై వ్యవసాయ శాఖ ఏడీ యల్లప్ప రైతులకు పలు సలహాలు, సూచనలు శుక్రవారం తెలియజేశారు.

నేలరంగు: రంగును బట్టి నేలలు మూడు రకాలుగా ఉన్నాయి. అవి నలుపు, ఎరుపు, మసక నేలలు. స్వభావాన్ని బట్టి నేలలు మూడు రకాలు. అవి తేలిక నేలలు (ఇసుక నేలల), మధ్యస్థ నేలలు (గరప), బరువు నేలలు (ఒండ్రు నేలలు).

లవణ పరిమాణ సూచిక:
ఎలక్ట్రికల్ కండక్టవిటీ (ఈసీ) నీటిలో కరిగే లవణ పరిమాణం.1.0 – 2.0 – అన్ని పైర్లకు అనుకూలంగా ఉంటుంది. 2.1 – 4.0: మొలకెత్తడం కష్టం. 4.0 పైన: పైర్లకు హాని కలిగించే విధంగా ఉంటుంది.

సేంద్రియ కర్బనం:
(ఆర్గానిక్ కార్బన్, ఓసీ): పైరు పెరగడానికి అనకూలమైన భౌతిక లక్షణాలు, నేల గుల్లబారడం, తేమను పట్టి ఉంచే శక్తి, మురుగునీటి సౌకర్యం వృద్ధి చెందడం వంటి గుణాలకు తోడ్పడుతుంది. ముఖ్యంగా సేంద్రియ కర్బన విలువలు 0.5 శాతం వరకు ఉంటే తక్కువగా, 0.5 శాతం నుంచి 0.75 శాతం వరకు ఉంటే మధ్యస్తంగా, 0.75 శాతం నుంచి పైన ఉంటే ఎక్కువగా పరిగణిస్తారు. ఓసీ తక్కువగా ఉన్నప్పుడు సేంద్రియ ఎరువులను వేసి సరిచేసుకోవాలి. ముఖ్య పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియంతో మొక్క ఏపుగా పెరగడం, ఆరోగ్యంగా ధృడంగా ఉండటం, రోగ నిరోధక శక్తి పెరగడం వంటి వాటికి ఉపయోగపడుతాయి. ఉప పోషకాలైన కాల్షియం, మెగ్నీషియం, గంధకం, జింక్, రాగి, ఇనుము, మాంగనీసు, బోరాన్, మాలిబ్డినం, క్లోరిన్‌లు మొక్కలో కిరణజన్య సంయోగ క్రియ అవసరమైన పత్ర హరితంలో తయారు చేసుకోవడానికి నూనె గింజల పైర్లలో మాంస కృత్తులు, నూనెలు తయారవడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయి.

ఆధునిక సాగు పద్ధతులతో పోషక లోపాలు:
ప్రస్తుతం నేలలో పోషకాలు కొంత మోతాదులో నేల నుంచి పైరుకు అందుతున్నా అధిక దిగుబడి నిచ్చే రకాల సాగు ఆధునిక వ్యవసాయ సాగు విధానాల వల్ల పోషక లోపాలు తలెత్తుతున్నాయి. భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి పైరుకు సిఫార్సు చేసిన మోతాదులో పై పోషకాలను సేంద్రియ, రసాయనిక ఎరువుల రూపంలో అందించడం వల్ల అధిక దిగుబడులు పొందొచ్చు.

భూసార పరీక్షలు తప్పనిసరి



రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్లో అన్ని ఆర్‌బీకేల పరిధిలో మట్టి నమూనాలు సేకరిస్తున్నాం. మట్టి నమూనాలను అనంతపురం ల్యాబ్‌కు పంపిస్తున్నాం. సహజ సేంద్రియ వనరులను ఉపయోగించుకుంటూ మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – యల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం

పాఠశాలలకు పుస్తకాల సరఫరా



కూడేరు ఎమ్మార్సీ నుంచి విద్యా సామగ్రిని తరలిస్తున్న దృశ్యం

కూడేరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేసే పాఠ్యాంశ, నోటు పుస్తకాలను, బెల్టులు, బ్యాగులు, ఇతర విద్యా సామగ్రిని అందిస్తామని మండల విద్యాధికారి -2 సాయి కృష్ణ శుక్రవారం తెలిపారు. మండలానికి సరఫరా అయిన పాఠ్యాంశ, నోటు పుస్తకాలను, ఇతర విద్యా సామగ్రిని కూడేరులోని ఎమ్మార్సీ సెంటర్ నుంచి పాఠశాలలకు సరఫరా చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు శివ, రమణ, ఆదిలక్ష్మీ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గుమ్మఘట్ట: వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యులు రమేష్ తెలిపారు. పీహెచ్‌సీ కేంద్రంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో నీరునిల్వ లేకుండా చూడాలన్నారు. నీటినిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది, రోగాలకు కారణమవుతుందనే విషయాన్ని ప్రజలకు అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించాలన్నారు. డ్రైనేజీలు ,రోడ్లపైన నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. జ్వరపీడితులు ఉంటే వారిని, గుర్తించి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలోవైద్యులు బాలాజీనాయక్, సీహెచ్‌ఓ మురళీధర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కూడేరు: మండల కేంద్రం కూడేరులోని బాలికల వసతి గృహంలో 2024–25 విద్యా సంవత్సరానికిగాని 65 సీట్లు ఖాళీ ఉన్నట్లు హాస్టల్ వార్డెన్ మాధవీలత శుక్రవారం తెలిపారు. అడ్మిషన్లు ప్రారంభిచామని అర్హత ఉన్న బాలికలు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తు ఫారాలు హాస్టల్‌లో ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

నేడు కలెక్టర్ పర్యటన

శెట్టూరు: మండల పరిధిలోని ఎర్రబోరేపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం పర్యటించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరరెడ్డి తెలిపారు. గ్రామంలో నిర్వహించిన వాటర్ షెడ్ పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నిర్వహించిన నేల, నీటి సంరక్షణ పనులు, అంతర పంటల నమూనా, బహుళ మొక్కల పెంపకం, జీవామృతం తయారీ యూనిట్లను ఆయన పరిశీలిస్తారన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

వజ్రకరూరు: మండలంలో ఈనెల 15న శనివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ షెక్షావలి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుత్తి 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తె లిపారు.

ఎకరాకు రూ.42 వేల క్రాప్‌లోన్

కూడేరు: కూడేరులోని స్టేట్ బ్యాంక్‌లో కొత్తగా క్రాప్‌లోన్లు ఇస్తున్నట్లు ఫీల్డ్ ఆఫీసర్ గోపీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరాకు రూ.42 వేలు చొప్పున క్రాప్ లోన్ ఇస్తామన్నారు. కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలు, 1బీ అడంగల్, 2పాస్ ఫొటోలు తీసుకొని రావాలని కోరారు. ఇప్పటికే 1,976 మంది క్రాప్‌లోన్ ఖాతాదారులుండగా 1,300 మంది రైతులు రెన్యూవల్ చేసుకున్నారన్నారు. మిగిలిన వారివి వారికి కేటాయించిన తేదీల్లో రెన్యూవల్ పూర్తి చేస్తామన్నారు. రెన్యూవల్ చేసుకునే రైతులు 1బీ అడంగల్ ఇవ్వకపోతే వెంటనే తెచ్చి, ఇవ్వాలని ఆయన కోరారు.

ఉషోదయ స్కూల్‌ను సీజ్ చేయాలని నిరసన

ఉరవకొండ: పట్టణంలోని ఉషోదయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాయలసీమ విద్యార్థి యువజన సంఘం (ఆర్ఎస్‌వైఎఫ్) ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. విద్యార్థి సంఘం నాయకులు భీమేష్, చిరంజీవి మాట్లాడుతూ శ్రీ ఉషోదయ స్కూల్ యాజమాన్యం అనుమతి లేకపోయినా హాస్టల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఫీజుల పేరుతో దోపిడీ చేస్తూ, ఒకే క్యాంపస్‌లో రెండు పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హతలేని వారిని టీచర్లుగా నియమించి, బోధిస్తున్నట్లు తెలిపారు.